## అన్యోన్యమైన ఆ జంటనుచూసి భర్తకు దూరమైన ఆమె ఏం చేసింది?

# ప్రేమంటే ?

**పాటిల్ రవీంద్రనాథ రెడ్డి కథ**

మెలకువ వచ్చినా అలాగే మగతగా పడుకున్న సంగీతకు ఇద్దరు ఆడా మగా నవ్వులు కలగలిపి వినిపించడంతో లేచికూర్చుంది. ఆత్రంగా వెళ్లి కిటికీ కర్టెన్ లాగింది.

సంగీత వున్నది మేడమీది గది. అక్కడి నుండి కిటికీలోకి చూస్తే పక్క ఇంటి వెనుకభాగం స్పష్టంగా కనిపిస్తుంది.

అక్కడ — చెట్టునుంచి పూలను కోసుకుంటోంది శ్రావణి. ఆమెను పూలు కోసుకోనివ్వకుండా అల్లరి పెడుతున్నాడు శేఖర్.

"అబ్బా! మీరిలా చేస్తుంటే నాకు ముళ్లు గుచ్చుకుంటున్నాయి!" అంటూ వేలు చూపించింది. ఆ వేలు పట్టుకుని ముద్దుపెట్టుకోబోతుంటే చేతిని వెనక్కి లాక్కుంది.

"ఈరోజు లేచిందగ్గర్నుంచీ ఎందుకిలా?"


"ఇంకా గుర్తురాలేదన్నమాట. ఈరోజుకు మన పెళ్లయి రెండుసంవత్సరాలవుతోంది!"

పైకిచూసి ఏదో కొత్త విషయం కనుక్కున్నట్లు అంది "ఆ! ఈరోజే! నాకసలు గుర్తే లేదు!"

"ఇప్పుడు గుర్తొచ్చిందికదా! ఈ రోజంతా మనం ఏమేం చేయాల్సింది నేను చెప్తాను" అంటూ శ్రావణి భుజమ్మీద చేయివేసి మాట్లాడుతూ లోనికి తీసుకెళ్లాడు.

తెరిచిన కర్టెన్ను విసురుగా మూసేసింది సంగీత!

బాగా నిద్రపట్టడంతో మెలకువరాగానే చాలా హాయనిపించింది. ఇప్పుడలా లేదు!



అసలురాత్రంతా. నిద్రపోవట్టే గజిబిజిగా వుంది! బెడ్‌మీద వెవక్కువాలి అడ్డంగా పడుకుంది.

"అమ్మగారూ కాఫీ!" అంటూ డోర్‌మీద కొడుతున్న శబ్దం!

సంగీత పట్టించుకోలేదు!

ఆగి ఆగి నాలుగుసార్లు కొట్టిన తర్వాత విసురుగా వెళ్లి తలుపుతీసింది. దూకుడుగా

వచ్చి తలుపు తెరిచిన సంగీతను చూసి కాఫీ కప్పుతో వున్న పనిమనిషి బిత్తరపోయింది!

"ఒకటిరెండుసార్లు పిలిచి పలక్కపోతే వెనక్కెళ్లలేవూ?"

"మీరేకదండీ! ఏడింటికల్లా కాఫీ రెడీగా కావాలన్నారు"

"ఇంత భయంకరంగా డిస్టర్బ్ చేయమనలేదు! నాకీరోజు టిఫిన్‌కూడా వద్దు! పైకి ఎవరూ రావద్దు వెళ్లు" విసురుగా తలుపేసేసింది!

పనిమనిషి గొణుక్కుంటూ వెళ్లిపోయింది.

'ఛ! ఇలా తెల్లారిందేమిటీరోజు!' విసుక్కుంటూనే వెళ్లి, ఛైర్‌లో వెనక్కు ఆనుకుని కళ్లు మూసుకుని కూర్చుంది.

'శేఖర్ జీవితాన్ని ఆనందంగా గడిపేస్తున్నాడు!

ఎన్నాళ్ళిలా తను?

ఇక్కడకు వచ్చి పదిరోజులు గడిచిపోయింది. అమ్మా, నాన్న కూడా తనను అదోలా చూస్తున్నారు. అయినా తన జీవితం తనిష్టం! వాళ్లకు భారంగా వుంటే చెప్తే ఎక్కడైనా వెళ్లిపోనా? మనశ్శాంతే లేకుండా పోతోంది.

శేఖర్ తననింకా ప్రేమిస్తూనే వున్నాడా? వుండకపోవచ్చు. లేకుంటే తనువచ్చి పదిరోజులైంది. తన ప్రెజెన్స్‌ని ఫీలయ్యుంటే భార్యతో అంత కులాసాగా ఎలా గడుపుతాడు?

ఎందుకు గడపదు?! తన పెళ్లయిన సంవత్సరానికి శేఖర్‌కి పెళ్లయింది. అప్పటికే మరచిపోయుండొచ్చు. అంత అటాచ్‌మెంట్ వుండడానికి ఇద్దరమూ ఒకర్నొకరు ప్రేమించుకోలేదుకదా! శేఖర్ తనని ప్రేమిస్తున్నానన్నాడు. తాను కాదంది! అంతే! మరచిపోయుండొచ్చు!

శేఖర్ తన భార్యతో వున్నంత ఆనందంగా, తాను ఆనంద్‌తో గడిపిందా? అలా వుండివుంటే మూడేళ్లకి ఇలా పోట్లాడి ఇక్కడకు వచ్చి వుండేది కాదేమో?

అసలు శేఖర్‌నే పెళ్లిచేసుకునుండుంటే?!'

ఉలిక్కిపడి కళ్లు తెరిచి నిటారుగా కూర్చుంది!

'ఛ! తనేమిటి ఇలా ఆలోచిస్తోంది! శేఖర్‌ను పెళ్లాడనందుకు చింతిస్తోందా? ఊహూ! అలా ఎప్పటికీ అనుకోదు. తను చేసింది కరెక్టే. అసలప్పుడు తన స్టేటస్ ఏమిటి? శేఖర్ ఏమిటి? తమ ఫ్యాక్టరీలో ఒక మేనేజర్ శేఖర్ వాళ్ల నాన్న. ఇదేమన్నా సినిమానా తను శేఖర్‌ను పెళ్లాడడానికి?

అయినా ఇప్పుడు శేఖర్ జీతమెంతనీ?

అతనొక జూనియర్ ఇంజనీర్! ఆ మాత్రం జీతం తీసుకునేవాళ్లు నాన్నక్రింద చాలామంది వుంటారు.

శేఖర్ ప్రేమను తిరస్కరించకుండా, అతన్నే పెళ్లిచేసుకుని వుంటే? ఇంతకంటే ముందే శేఖర్‌నుండి విడిపోయేదాన్నేమో?! అతనికి డబ్బిచ్చినా మాత్రం తనలాగా కాస్ట్లీగా బతకడం చేతనయ్యుండొద్దూ!

అసలిప్పుడు తన జీవితానికేమైందనీ? ఏవో చిన్నఒడిదుడుకులంతే! తనే ముందు వెళ్తే ఆనంద్‌కు లోకువై పోదూ? ఆనందే ఇక్కడకురావాలి!'

హుషారుగా లేచివెళ్లి ముఖం కడుక్కుంది!

'అతను హేపీగా వుండాలి! తనే శేఖర్‌ను

యాక్టివ్‌గా పలకరిస్తూ వుండాలి. తన ప్రవర్తన మూడీగా, జాలిగొలిపేలా వుండ కూడదు. తను ఆనందంగానే వున్నట్టు శేఖర్ అనుకోవాలి!'

తనకు తనే ధైర్యం చెప్పుకుంటూ క్రిందికి దిగివచ్చింది. పనిమనిషికి సారీ చెప్పింది!

"టిఫిన్ త్వరగా పెట్టు. తర్వాత కాఫీ స్ట్రాంగ్‌గా కలుపు" అంటూ నవ్వుతూ హుషారు చేసింది!

న్యూస్ పేపర్ చదువుతూ టిఫిన్ చేసింది. పనిమనిషి ఆశ్చర్యంగా చూస్తూనే కాఫీ కలిపిచ్చింది.

"అమ్మా, నాన్న కనిపించడంలేదే?"

"పొద్దున్నే ఎక్కడికో వెళ్లిపోయారు!" గ్లాసందుకుంటూ చెప్పింది పనిమనిషి.

పేపరు తీసుకుని వెళ్లి బయట సోఫాలో కూర్చుంది సంగీత. శేఖర్ స్కూటర్ స్టార్ట్‌చేసిన శబ్దం వినిపించింది. చూడకుండా వుండాలనుకుంది.

'పెళ్లిరోజట. ఇద్దరూ పొద్దున్నే బయలు దేరారా?' ఆ విషయం గుర్తుకురాగానే మెయిన్‌గేటువైపు చూసింది. గేటుదాటి వెళ్లిపోబోతున్న శేఖర్, ఒక్కతే కూర్చున్న సంగీతను చూసి లోనికి వచ్చాడు. స్టాండ్ వేసి వచ్చి పలకరించి సోఫాలో కూర్చున్నాడు. సంగీత తను సంతోషంగా వున్నట్టుండాలని ముఖమంతా నవ్వు పులుముకుంది!

"ఏమిటీ? చాలా హుషారుగా వున్నట్టున్నావ్!" క్యూరియాసిటీ చూపకుండా అడిగింది.

"పెళ్లిరోజు" నవ్వుతూ చెప్పాడు శేఖర్.

తనూ ఇంకాస్త గట్టిగా నవ్వింది. డిగ్నిఫైడ్‌గానే నవ్వాననుకుంది!


"అప్పుడే ఆఫీసుకా?"

"చిన్న లీవ్ అడగడం మర్చిపోయాను. లెటర్ కొలీగ్‌కి ఇచ్చివద్దామని"

"ఓకె!"

అలా కట్‌చేసినట్టు అన్నతర్వాత శేఖర్

## స్త్రీలు ప్రశాంతంగా వుండాలంటే...!



బ్రిటన్‌కు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ డేవిడ్ బెంటన్ ఈ మధ్యన ఓ తమాషా పరిశోధన చేశారు. ఆయన చెప్తున్నదాన్నిబట్టి ఎక్కువగా పళ్లు, కూరలు తినే స్త్రీలు మానసికంగా ఎంతో ఆరోగ్యంగా వుంటారట! కూరలు, పళ్లలో ఎక్కువ ఖనిజ లవణాలు, విటమిన్‌లు వుండడంతో ఇది సాధ్యపడుతుందని ఆయన అంటున్నారు. ఆయన ప్రయోగాత్మకంగా ఈ విషయాన్ని రుజువుకూడా చేశారుకూడా. కాబట్టి స్త్రీలంతా ఈ విషయాన్ని గుర్తుంచుకుంటే వారికెంతో మానసిక శాంతి!

ముఖం చూడాలన్న కుతూహలం కలిగింది! చూడలేదు! అసలింతవరకూ మాట్లాడుతున్నా, శేఖర్‌వైపు సూటిగా చూడలేదు!

"వస్తా సంగీతా!" అనేసి వెళ్లిపోయాడు.

పేపరులోంచి తలెత్తకుండానే నవ్వుకుంది! ఎందుకో అర్థంకాలేదు?! శేఖర్ అటెళ్లిపోగానే పేపర్ పక్కన పడేసింది. తన ప్రవర్తన తనకే విచిత్రంగా అనిపించింది! చికాకు కలిగింది!

రెండు కాంపౌండ్‌లకు మధ్య వున్న చిన్న గేటు తీసుకుని శేఖర్ ఇంట్లోకెళ్లింది. శ్రావణి వంటచేస్తోంది.

ఇంతకుముందు సంగీత ఇక్కడకు వచ్చినా రెండుమూడురోజులకంటే ఎక్కువ వుండేదికాదు. శ్రావణితో కొద్దిగా పరిచయం. ఈసారి పదిరోజులుండడంతో చనువేర్పడింది! నేరుగా వంటింట్లోకెళ్లింది. సంగీతను చూడగానే శ్రావణి ఆశ్చర్యపోతూ అంది "ఎంతసేపయిందో వచ్చి, నేను చూడనేలేదు! రండి హాల్లో కూర్చుందాం!"

శ్రావణిని చూసినప్పుడల్లా సంగీతకనిపిస్తుంది — "ఈ మనిషింత ప్రశాంతంగా ఎలా వుండగలుగుతోంది? బాధలే లేనట్టు!'

శ్రావణిని చూస్తే ఎవరికైనా అలాగే అనిపిస్తుంది!

పలకరించగానే నవ్వుతుంది! ఆ నవ్వు చాలా ఆహ్లాదంగా అనిపిస్తుంది. ఆ నవ్వులో మనసులోని నిర్మలత్వం, సంతృప్తీ కానవస్తాయి! వెన్నెల మింగినట్లు ముఖమంతా చంద్రబింబంలా వెలుగుతుంది!

చిన్న జోకేసినా పసిపిల్లలా నవ్వేస్తుంది! ఇంకాసేపు మాట్లాడదామనిపిస్తుంది!

శ్రావణితో మాట్లాడుతుంటే — హఠాత్తుగా పెద్ద సిటీనుంచి, పచ్చని పల్లెటూళ్లో వాలినట్లుగా వుంటుంది!

సంగీత సంభాషణని శేఖర్ ఫామిలీలోకి లాక్కొచ్చింది.

"శేఖర్ నిన్నుబాగా చూసుకుంటాడా?"

"ఊఁ! నేనంటే ప్రాణం!"

"ప్రాణం అంటే?" కావాలనే అడిగింది ఏం చెప్తుందో అని!

"అంటే నాకు ఏ చిన్న ఇబ్బందీ కలగనివ్వడు. పువ్వుల్లో పెట్టుకుని చూసుకుంటాడంటారే, అట్లా చూసుకుంటాడు!

నేను చాలా మంచిదాన్నంట! భగవంతుడు నన్ను ఆయనకు వరంగా ఇచ్చాడంట! ఇంకా ఏమో అంటుంటాడు. నాకు సరిగా అర్థంకాదు!"

"మరీ అంతలా చెప్తున్నావు! ఎప్పుడూ నీమీద కోప్పడలేదా ఏంటి?'

"కోప్పడతాడు! కానీ ఎందుకో తెలుసా? నేను ఆయనేమి చేసినా సహిస్తానంట. అలా కాకుండా ఆయన తప్పుచేసినప్పుడు నేను తిట్టాలంటాడు. ఆఫీసునుంచి లేటుగా వచ్చినప్పుడు 'ఎందుకు లేటైందని అడగవా?' అంటాడు! పాపం ఆయన పొద్దున్నుంచీ ఆఫీసులో ఎంత పని చేసివస్తాడో?! లేటుగా వస్తే మాత్రం అలా నిలదీయాలా? కానీ అలా అడగాలంటాడు!

ఒకసారి నాకు జ్వరమొచ్చింది!

ఆయన అన్నం వండుతానంటే ఒప్పుకోకుండా నేనే చేస్తున్నాను. మధ్యలో వచ్చి 'గంజయినా వంచుతాములే' అని ఎత్తినాడు!

ఆదిజారి నాచేతిమీదపడింది! బొబ్బలెవాయి!

నాకాయనమీద కోపమే రాలేదు — కొంచెంకూడా!

'నన్నసలు విసుక్కోవైనా విసుక్కోవేం శ్రావణీ' అంటూ ఇదైపోయాడు! నాకంటే ముందు ఆయన కళ్లల్లో నీళ్ల తిరిగాయి. ఆ రోజంతా నన్నంటిపెట్టుకునే వున్నాడు" అని ఆపింది! "వస్తానుండండి" అంటూ వంటింట్లోకెళ్లబోతూ ఆగి, సగం ముఖం మాత్రమే ఇటువైపు తిప్పి, "ఆ రోజంతా నన్నెన్ని ముద్దులు పెట్టుకున్నాడని" అనేసి వెళ్లిపోయింది సిగ్గుపడ్తూ!

సంగీత ముఖంలో ఏ ఫీలింగూ రాలేదు! మౌనంగా కూర్చునుంది! వంటింట్లో పని చూసుకుని కాసేపటికి వచ్చింది శ్రావణి.

"ఆయన కవితలు కూడా రాస్తాడు — మీకూ తెలుసనుకుంటా! మధ్యలో చాలా రోజులు మానేశాడట. నన్నుచూస్తే కవిత్వం దానంతట అదే వస్తుందట" కిసుక్కుమని నవ్వింది శ్రావణి! సంగీత నవ్వలేదు!


"నా కళ్లలోకి చూస్తూ ఆలోచిస్తాడు! ఏదో రాస్తాడు! నాకప్పుడు చూపించడు. తర్వాత నేను చదువుతాము. చిన్నచిన్న కవితలే! భలే వుంటాయి! అన్నీ నాగురించే! ఆయన మీకు బాగా పరిచయం కదా! చూపిస్తానుండండి!" శ్రావణి లేచివెళ్లి ఒక అందమైన లెటర్ పాడ్ తెచ్చింది!

సంగీత దాన్నందుకుని తిరగేసింది. శ్రావణి ముఖమంత అందంగా అందులో అక్షరాలు కూర్చబడి వున్నాయి!

☆ ★ ☆

"శ్రావణీ!
నువ్వు నా జీవితంలో ప్రవేశించకుండా
వుండివుంటే?
ఈ భావుకుడి జీవితం
అసంపూర్తిగా ముగిసేదేమో అనిపిస్తుంది!
ఇప్పుడు —
ఈ అదృష్టం ఈ జన్మకు మాత్రమేనేమో
అనిపిస్తుంది!!

☆ ★ ☆



"శ్రావణీ!
నువ్వొక గొప్ప వరం!
ఎంత గొప్ప వరమంటే — ఈ చిన్న జీవితానికి సరిపోనంత!
ఎందుకంటే?
కేవలం నీ కళ్లలోకి చూస్తూ వుండిపోవడానికే ఒక జీవితం చాలదు!"

☆ ★ ☆

చిన్నవే చాలా కవితలు! ఒక్కో కవితా శేఖర్ హృదయాన్ని తెలియజేస్తున్నాయి. ప్రియురాలికి, ఒక భావుకుడైన ప్రేమికుడు ఇచ్చినబహుమానాలివి!

సంగీత వచ్చేసింది!

ఉదయంనుంచీ — సంతోషంగా వుండాలని, గాలిలా నింపుకున్న ఉత్సాహమంతా — బుడగ పేలినట్లయి వెళ్లిపోయింది!

మనసు కుంచించుకుపోతోంది!

మౌనంగా తన గదిలోకెళ్లి తలుపేసుకుంది. శక్తి అంతా హరించుకుపోయినట్టు బలహీనపడిపోయింది. బెడ్‌మీద వాలిపోగానే దుఃఖం తన్నుకువచ్చింది!

ఏడ్చిక ఎన్నో ఏళ్లయిపోయింది! ఏడుపు కోసమే ఎదురుచూస్తున్నట్టు — తాను చేయవలసిన పని ఏడ్వడం మాత్రమే అన్నట్టు — బతకాలంటే ఏడ్చక తప్పదన్నట్టు ఏడ్చింది!

'ఎంత గొప్ప ప్రేమికుణ్ణి పోగొట్టుకున్నాను!

ఎంత మూర్ఖంగా శేఖర్‌ను కాదనుకున్నాను!

ఇప్పుడింకేం మిగిలిందని — ఏడుపు తప్ప!

ఎంత నిస్సారంగా గడిచిపోయింది ఈ మూడేళ్ల తన వైవాహిక జీవితం. ప్రేమంటే ఎలా వుండాలో తెలిశాక — ఆనంద్ తన్నలా ఒక్క క్షణంకూడా చూడలేకపోయాడే అనిపిస్తోంది!

ఇంక ఈ జీవితానికి తన్నెవరూ ప్రేమించలేరేమో?!'

☆ ★ ☆

రోజులు గడుస్తున్నాయి! ఇప్పుడు —

సంగీతకు భర్త గుర్తులేదు. అతనొస్తాడేమో అన్న ధ్యాస లేదు. తమ భర్తతో గొడవపడి పుట్టింటిలో వున్నానని, తన సంసారం బాగుపడడానికి తన తల్లిదండ్రులు తమ ప్రయత్నాలు తాము చేస్తున్నారనే ఆలోచనే లేదు!

ఆమె మనసంతా శేఖర్ మీదే!

'శేఖర్‌కు ఒక్కసారిగా గతం తాలూకు భావన కలిగించాలి! "శ్రావణీ! నువ్వన్నా, నీ చలాకీతనమన్నా నాకెంతో ఇష్టం. నువ్వే గుర్తొస్తున్నావు మాటిమాటికీ! నువ్వు నన్నెప్పుడూ ఆటపట్టిస్తూనే వుండాలనిపిస్తుంది! ఇదేకదా మరి ప్రేమంటే!" అని సిన్సియర్‌గా అప్పుడు చెప్పిన శేఖర్‌ని మళ్లీ ఒక్కసారి చూడాలి!

శేఖర్‌ని వెనక్కి లాక్కెళ్లాలి!

శేఖర్ జీవితాన్నంతా, తన మిగిలిన జీవితంతో కలిపి లాక్కెళ్లాలన్నంత ఆశ తనకొద్దు! అంత అర్హత తనకిప్పుడు లేదు!

ఒక్క క్షణం "నన్నింకా ప్రేమిస్తున్నావన్న" భావన శేఖర్‌కు కలిగితే చాలు!

సంగీత మానసికంగా శేఖర్‌కు బాగా దగ్గరైపోయింది. ఆమె భౌతిక పరిస్థితులనాలోచించుకునేంత స్థిమితంగా లేదు. తను తక్షణం ఇక్కడికమంచి దూరంగా వెళ్లిపోవా

లవి, ఎడబాటు తనకు స్వాంతన చేకూర్చగలదేమోవని ఆలోచించుకునే స్థితిలో ఆమె లేదు!

అదేపనిగా వెళ్లి శేఖర్‌తో చాలాసేపు కబుర్లు చెబుతూ వుండేది. ఇంతకు ముందెన్నడూ లేవంత స్వచ్ఛంగా భేషజాలులేకుండా విజాయితీగా సంగీత మాట్లాడడం శేఖర్‌కు ఆశ్చర్యం కలిగిస్తోంది!

ప్రతిరోజూ సాయంత్రం శేఖర్‌తో గడుపుతోంది!

ఇద్దరూ మాట్లాడుతోంటే శ్రావణి చాలాసార్లు, ఇద్దరికీ టిఫిన్ తీసుకునివచ్చి — తమా వింటూ కూర్చునేది! శేఖర్‌కనిపించేది — 'తాను, సంగీతా అంత క్లోజ్‌గా మాట్లాడుతుంటే మసకచీకట్లో గార్డెన్‌లో తిరుగుతుంటే — శ్రావణికే అనుమానపు ఫీలింగూ కలగదా? ఈ మనిషికెంత నమ్మకం తనమీద! ఈమెకింత గొప్ప మనసెలా వచ్చింది!'

ఒకరోజు చీకటి నిదానంగా పరచుకుంటోంది!

ఇంటి గార్డెన్‌లో నిలబడి మాట్లాడుకుంటున్నారు సంగీత, శేఖర్! శ్రావణి ఇంట్లో వుంది!

"శేఖర్! నేను పూర్తిగా మారిపోయాను. ఇంతకుముందు సంగీతనుకాను! నువ్వు కోరుకునే స్త్రీలాంటి సంగీతను!"

"సంగీతా! ఏమిటిలా మాట్లాడుతున్నావ్?"

"శేఖర్! నేనింకా ఎన్నిరోజులో ఇలా దాచుకుని వుండలేను. నువ్వింకా ఎందుకు అర్థం చేసుకోలేకపోతున్నావు? నేను నిన్ను మనసారా ప్రేమిస్తున్నానిప్పుడు! ఇది నిజం! నన్నునమ్ము!"

శేఖర్ చేతుల్ని తనచేతుల్లోకి తీసుకుంది. వెనక్కు జరిగాడు! సంగీత కళ్లలోంచి జారిన కన్నీరు చుక్కలై, అతని చేతులు తడుపుతూ అవే మాటలు చెప్తున్నట్టుంది!

"నిన్ను మూర్ఖంగా తిరస్కరించి నేను పెద్ద పొరపాటు చేశాను. ఒక్కసారి

# మాకోసం

"మీ నాన్నగారు గొప్ప రచయితకదా... నిజంగా ఆయన కొడుకుగాపుట్టినందుకు నీవుగర్వించాలిరా!"

"గర్వించాలా? ఎందుకు?... మాకేం చేశాడని... అందరికోసం రాస్తాడుగానీ... మాకోసం ఏమైనా రాశాడా"

"అదేమిట్రా మీకోసం రాయడమేమిట్రా!"

"అదే... వీలునామా!"

— ధనశ్రీ (పీపల్‌పహాడ్)



'నన్ను ప్రేమిస్తున్నావ'నవూ! 'సంగీతా! నేను నిన్నే ప్రేమించాను మొదట! నీకు నా మదిలో స్థానం ఎప్పటికీ వుంటుందని' ఒక్కసారి అను!"

శేఖర్ చేష్టలుడిగి నిలబడిపోయాడు! హిస్టీరిక్‌గా మాట్లాడుతున్న సంగీతను ఎలా సముదాయించాలో అర్థంకాక ఉన్నంతలోనే — సంగీత అతనికి మరింత దగ్గరగా వచ్చి భుజాల్ని గట్టిగా పట్టుకుని తనముఖాన్ని అతని ముఖానికి అతి దగ్గరగా చేర్చి —

"సంగీ... " వారిస్తూ అతనన్న మాట పూర్తికాకుండానే — తన పెదవులతో మూసేసింది.

శ్రావణి రాబోతూ ఇద్దరూ అతిదగ్గరగా వుండడం చూసి ఆగిపోవడమూ —

సంగీత శేఖర్ పెదవులతో తన పెదవుల్ని కలపడమూ —

శ్రావణి శ్రద్ధలై వెనక్కి తిరిగి వెళ్లిపోవడమూ —

సంగీతను శేఖర్ విడిపించుకోవడమూ—!

☆ ★ ☆

శ్రావణి వణుకుతూ వుంది షాక్ తగిలినట్లుగా! శేఖర్ ఇంట్లోకి రాగానే శ్రావణిని చూశాడు. ఆమెను చూస్తూనే అర్థమైపోయింది. చిన్న భావాన్నికూడా దాచుకోలేని ఆమె ముఖం చూసిందంతా చెప్తోన్నట్లుంది!

శేఖర్‌వంక భయంగా చూసింది! బెదురుగా చూసింది! పులిని చూస్తే లేడిపిల్ల కళ్లల్లో కనిపించే భావం శ్రావణి కళ్లల్లో కదలాడుతోంది!

శేఖర్ సిగ్గుతో చితికిపోతున్నాడు. శ్రావణికి దగ్గరగా రాబోయాడు! రెండడుగులు వెనక్కేసింది!

శ్రావణి తన నిరసనను తెలియజేస్తున్న పద్ధతి అర్థమవుతున్నకొద్దీ శేఖర్‌కు గుండె ముక్కలవుతున్నట్టుగా వుంది!

'శ్రావణిని కాపాడుకోవాలి! ఆ సున్నితత్వం కమిలిపోరాదు! ఆ చిరునవ్వు చెరిగిపోరాదు!' అన్నట్టుగా మరింత దగ్గరగా వెళ్లాడు!

శ్రావణి ఇంకొంచెం వెనక్కు జరిగి గోడవానుకుంది! ఆమె చేయి సోఫామీద గుచ్చిపట్టుకుని వుంది! క్రింది పెదవి వణుకుతోంది. కళ్లల్లో సుళ్లుతిరిగిన నీరు ఆమె ప్రమేయం లేకుండానే చెంపలమీద కారిపోతున్నాయి

'శ్రావణి ఏడుస్తోంది!' శేఖర్ ఆత్రంగా వెళ్లి పట్టుకున్నాడు!

"శ్రావణీ! నామీద అసహ్యంగా వుందా ? నేను నిన్ను మోసం చేశాననుకుంటున్నావుకదూ?!"

శ్రావణి ఏడుపు బిగబడ్తూ తల అడ్డంగా ఊపింది.

"అబద్ధం చెప్పొద్దు! నువ్వు అబద్ధం చెప్పడం నేను భరించలేను."

కళ్లల్లో నీళ్లు తిరుగుతుంటే అడిగాడు "మరయితే ఎందుకేడుస్తున్నావు?"

శ్రావణి మాట్లాడలేదు.

"చెప్పు"శేఖర్ రెట్టించాడు.

శ్రావణి గట్టిగా ఏడ్చేసింది!

ఆమె ఏడుపాపేశాక సోఫాలో కూర్చుండబెట్టాడు. బలవంతంగా ముఖం కడిగించాడు. కాస్సేపటికి శ్రావణి స్థిమితపడింది.

☆ ★ ☆

"సంగీతా!

నువ్వు ఉదయం లేచి చూస్తే మా ఇంటికి వేళాడుతున్న తాళం కప్ప నిన్ను వెక్కిరిస్తున్నట్టుగా వుండవచ్చు. నీతో కలవకుండా పనిమనిషికి వుత్తరం ఇచ్చేసి — మేమిలా అర్ధాంతరంగా అడ్రసైనా ఇవ్వకుండా వెళ్లిపోవడం — నీకు అవమానంగా వుండవచ్చు! మానసికంగా నువ్వు చాలా బలహీనంగా వున్న క్షణంలో — ఇలా చేయవలసిరావడం ! తప్పదు!! బాగా ఆలోచించి తీసుకున్న నిర్ణయమిది! ఇంతకంటే వేరే మార్గం లేదు!

నిన్ను మభ్యపెట్టాలనో, నీమీద కోపంతోనో ఉత్తరం రాయడంలేదు. నీకు ఈ ఉత్తరం ఆలోచించుకునే స్థిమితాన్ని చేకూరుస్తుందన్న ఆశతో రాస్తున్నాను.

చిన్నప్పటినుండి మనిద్దరికీ పరిచయం వుంది. వయసు పెరిగేకొద్దీకూడా నేను నిన్ను స్నేహితురాలిగానే భావిస్తూ వచ్చాను. నువ్వు మాత్రం నన్ను — మీ ఫ్యాక్టరీలో పనిచేసే మేనేజర్ కొడుకుగానే భావిస్తూ వచ్చావు!

నేను నిన్ను ప్రేమిస్తున్నట్టు ధైర్యాన్నంతా కూడగట్టుకుని చెప్పాను! అలా నీకు చెప్పడానికి ముందు, ఎంతో ఆలోచించుకుని మదనపడి, చివరికి చెప్పాలనే నిర్ణయించుకుని చెప్పేశాను! నువ్వుమాత్రం నన్ను నీ డబ్బుచూసి ప్రేమించాననుకున్నావు! తేలిగ్గా తీసుకున్నావు! తిరస్కరించావు! నీ స్టేటస్‌కు తగని నాతో ప్రేమేమిటనుకున్నావు!

ప్రేమకు పలు రకాల కోణాలు వుంటాయనీ, అవి వాడిగానూ వుంటాయని తెలిసొచ్చింది!

నువ్వూ, నేనూ సమానస్థాయిలో వున్నప్పుడు, నువ్వు నన్ను తిరస్కరించి వుండివుంటే నేను చాలా బలహీనపడిపోయి వుండేవాణ్ణేమో! కానీ నన్ను తిరస్కరించడానికి నీ స్టేటస్ కారణమవడంతో — అదే నన్ను నేను సమాధానపరచుకోవడానికి తోడ్పడింది!

నేను నిన్ను కోరుకుని విఫలమై —

## తమాషా రికార్డు



బాగా తిన్న తర్వాత ఎవరికైనా తేన్పు రావడం సహజం! అయితే ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఈ మధ్యనే డిగ్రీని పూర్తిచేసిన భరతభూషణశర్మ అనే యువకుడు 'రికార్డు' కోసం తేన్పుతాడు. అతను నిమిషానికి 91సార్లు... వరుసగా మూడు నిమిషాలు తేన్పగలడట! ఇప్పటికే అతని పేరు లిమ్కా రికార్డు పుస్తకంలోకి ఎక్కింది. గిన్నిస్ పుస్తకంలోకి ఎక్కే ప్రయత్నంలో వున్నాడు శర్మాజీ! ఆల్ ది బెస్ట్ శర్మాజీ!!

— జూపిటర్

మనశ్శాంతిని కోల్పోవడానికి — నువ్వెలా కారణమయ్యావో — అలాగే నేను త్వరగా నిన్ను మరచిపోవడానికి నువ్వే కారణమ య్యావు!

నీకోసం నేను ఆరాటపడడం నీకు ఆనందంగా వుండేది! నాతో క్లోజ్‌గా వుంటే — నేను మరలా నీకై తిరుగుతానని, పిచ్చిగా ప్రవర్తిస్తానని — అప్పుడప్పుడూ చాలా క్లోజ్‌గా వుండేదానివి! మళ్లీ నేను పలకరిస్తే లెక్కచేయనట్టుండేదానివి. అదం తా నువ్వు ఎంజాయ్ మెంట్‌గా భావించేదాని వి! అంతేకాదు — నీ బాయ్ ఫ్రెండ్స్‌తో అంతవరకూ మామూలుగా మాట్లాడుతు న్నదానివి — నన్ను చూడగానే బాగా క్లోజ్‌గా మూవ్ అయ్యేదానివి!

ఇవన్నీ నాకు — నువ్వుమానసికంగా ఎంత తక్కువ స్థాయిలో వున్నావో తెలియజే శాయి. కొన్నిసార్లు సంస్కారమే లేనట్లు మూఢంగా ప్రవర్తించేదానివి! ఇవన్నీ నీపట్ల నన్ను విముఖుడిని చేశాయి! కొద్ది రోజుల్లోనే — నువ్వంటే నాలో ఏ ఫీలింగూ కలిగేది కాదు!

తర్వాత నీ పెళ్లయిపోయింది! నువ్వు కోరుకున్నట్టే — నీ స్టేటస్‌కు తగినవాడితో! అప్పటికి నేను నిన్ను పూర్తిగా మరచిపోయా ను. ఆ విషయం తెలియక నువ్వు పెళ్లయ్యా క కూడా నీ భర్తతో కలిసి ఇక్కడకు వచ్చినప్పుడు నీ స్టేటస్‌ను ప్రదర్శించేదానివి. నేను నవ్వుకునేవాణ్ణప్పుడు!

నీమీద నాకున్న ఆకర్షణ — నీ ప్రవర్తన కారణంగా కొద్దిరోజుల్లోనే మంచులా కరిగి పోవడంతో అసలు నేను నిన్నునిజంగానే ప్రేమించానా అనిపించింది!

తర్వాత సంవత్సరానికి నాకు పెళ్లయింది శ్రావణితో! అది నా జీవితానికి ఒక అదృష్టం! నా పెళ్లవగానే నాన్న — తను చిన్నప్పుడు చదివిన వూరికి స్నేహితులతో గడపాలని వెళ్లిపోయాడు. అమ్మకూడా వెం ట వెళ్లింది! నేనూ, శ్రావణి ఇద్దరమే!

శ్రావణి ఒకవరం! నన్నెంత ప్రేమించేదో? నామీద ఎంత నమ్మకం వుంచేదో? ఈ ఉత్తరంలో తెలియజేయడం అసాధ్యమేమో?!

నన్నేమీ అనదే అని బాధపడాల్సొచ్చేది! నాకోసం దేన్నయినా సహించగలదు! అంతా తనే భరించాలంటుంది! బహుశా ఆమెకు సన్నిహితంగా వచ్చిన మొదటి మగాడిని అయ్యుండాలి! ఎంతగానో ప్రేమించేసింది!

శ్రావణి అమాయకత్వం, స్వచ్ఛత, నిజా యితీ నన్ను శ్రావణికి ఎంతో దగ్గర చేశాయి. పెళ్లికి ముందు మాకిద్దరికీ పరిచ యం లేకపోయినా, ఈ రెండేళ్లూ మానసిక ంగా మేం దగ్గరవడం చూస్తే ఎన్ని సంవత్సరాల అనుబంధమో అనిపిస్తుంది!

అదే సమయంలో నీ వివాహం విఫలమైం ది. కారణాలు నాకు తెలీదు. నిజాయితీగా ఆలోచిస్తే నీకే తెలుస్తాయి!

నువ్వు ఇక్కడికి వంటరి అయిపోయి వచ్చావు! మామూలుగా నీతో స్నేహంగా వున్నాను. నీమీద జాలి కలిగింది! నిదానంగా వివరాలు తెలుసుకుని నిన్ను మార్చాలనుకు న్నాను!

ఈలోగా నువ్వు శ్రావణిద్వారా మా అనుబంధం తెలుసుకున్నావు! నీకు చెప్పిన ట్లు శ్రావణి నాకు చెప్పింది. నువ్వు ఏం కోల్పోయావో నీకుతెలిసొచ్చింది! నిన్ను ప్రేమించేవాళ్లు నీక్కావలసి వచ్చారు! నేను

గుర్తొచ్చాను!

నువ్వు పొరపాటుచేశానని ఫీలయ్యావు. నువ్వు మారిపోయావు! పూర్తిగా మారిపోయావు. నన్ను ప్రేమించగలుగుతున్నావు! జీవితంలో మనసు స్పందించడం నీకిదే మొదటిసారనుకుంటాను. అందుకే నువ్వుంటున్న పరిస్థితినే మరచిపోయావు. టీనేజర్‌లా ప్రవర్తించావు. ప్రేమకోసం తపించిపోయావు! ఫలితమే మేమిలా అర్ధాంతరంగా వెళ్లిపోవడం!

నిన్నరాత్రి ఇద్దరినీ అలా చూసిన శ్రావణి పిచ్చిదైపోతోంది. అయినా నన్నేమీ అనలేదు. బహుశా తనను తాను శిక్షించుకుంటుందేమో! శ్రావణి అంతే!

నేను శ్రావణిని ఎంతగా ప్రేమిస్తున్నానంటే — ఒక్క మాట చెప్తాను!

'శ్రావణిని నేనుకాక ఇంకెవరైనా పెళ్లిచేసుకుని వుండి వుంటే శ్రావణి మంచితనాన్ని వాడు ఎంత అవకాశవాదంగా మలచుకుని వుండేవాడో — ఈ శ్రావణి ఎంతగా కుమిలిపోయి వుండేదో?' — ఇలా అనుకుంటే నాకు మనసంతాకంపించినట్టవుతుంది!

అక్కడే వుంటూ ఒక్క క్షణంకూడా శ్రావణి మామూలుగా గడపలేదని అర్థమైపోయింది!

అందుకే తెల్లారేసరికి వుండకూడదని వెళ్లిపోతున్నాము! ప్రస్తుతానికి ఎక్కడో ఒకచోట వుండి — త్వరలో వేరే ఇల్లు చూసుకుంటాము!

ఇప్పుడు నువ్వు స్థిమితంగా ఆలోచించు. పరిస్థితి నీకే అర్థమవుతుంది! ఇప్పుడు నువ్వు మంచిగా మారావు! జీవితం విలువ తెలిసొచ్చింది!

ఈ మూడేళ్లలో నువ్వు ఆనంద్‌నూ, ఆనంద్ నిన్నూ ప్రేమించి వుండకపోవచ్చు! కానీ ఈ మూడేళ్ల కాపురానికి మీ మనసుల్లో విలువ లేకుండా పోదు.

నువ్వు ఆనంద్ దగ్గరకు వెళ్లు! నువ్విప్పుడు మంచిగా వుండగలవు! ఇంతకు ముందుకూ, ఇప్పటికీ నీలో వచ్చిన తేడా అతన్ని తప్పకుండా నీపట్ల ఆకర్షింపజేస్తుంది!

ఈరోజు తెల్లవారేటప్పటికి మేమెలా ఇల్లు వదిలిపెట్టేశామో —

రేపు తెల్లారేలోగా నువ్వూ ఇంటిని వదిలెయ్! ఆనంద్‌ను చేరుకో!

'ఇంతకుముందు సంగీతను కాను! నువ్వు కోరుకునే స్త్రీలాంటి సంగీతను' అని నువ్వు చలించిపోయి, కన్నీటితో చెప్పిన తర్వాత నిన్నెలా మర్చిపోగలను! నీ జ్ఞాపకం నాదగ్గర అతి భద్రంగా వుంటుంది!

మళ్లీ నిన్ను కలిస్తే అప్పుడు నువ్వు మంచితనం, చలాకీతనం కలిసినట్లు కనిపించాలని ఆశిస్తూ — శేఖర్!

☆ ★ ☆

